సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



సోమశిలలో 47.92 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 47.92 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 15,500 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,780
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,680
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,880
నవర (8 గ్రాములు)	రూ.55,040

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.5 /27.5

జిల్లాలో వాతావరణం బుధవారం పొడిగా ఉండే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 45 శాతంగా నమోదైంది.



ఈ భవనం నగరంలోని జీఎన్‌టీ రోడ్డులోని ఆర్‌కే ల్యాబ్ ఎదురుగా, ప్రభుత్వ మద్యం దుకాణం పక్కనే ఇటీవల నిర్మించారు. ఈ బహుళ అంతస్తుల నిర్మాణానికి కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. అంతేకాకుండా ఈ దీనిని పంటకాలువ (గచ్చుకాలువ) పైన చేపట్టారు. అంటే కనీసం ఆ స్థలానికి సంబంధించి రికార్డు పరంగా ప్రభుత్వం ద్వారా లభించిన దస్త్రాలు కూడా లేవు. ఈ నిర్మాణానికి సంబంధించి టౌన్‌ప్లానింగ్ ద్వారా సదరు యజమానికి రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. అయితే దీని యజమాని అధికారులకు ఎలాంటి జవాబు ఇవ్వలేదు. చివరకు చార్జిషీట్ కూడా సిద్ధం చేయబోతున్నట్లు సమాచారం. ఈలోగా సదరు యజమాని భవన నిర్మాణాన్ని దాదాపు 90శాతం పూర్తి చేశారు. ఇదంతా తెలిసి కూడా టౌన్‌ప్లానింగ్ అధికారులు మౌనం వహిస్తున్నారు. వారికి ముడుపులు ముట్టడం వలనే పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



ఈ భవనం నిర్మాణం నగరంలోని వాకర్స్‌రోడ్డు, మన్సూర్‌నగర్ కాలువ పక్కన జరుగుతోంది. ఇక్కడి స్థలంలో భవనం నిర్మించుకునేందుకు సదరు యజమాని రెసిడెన్షియల్ కింద దరఖాస్తు చేసుకుని అప్రూవల్ పొందారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ (వాణిజ్య) పరంగా కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. అంతేకాకుండా పక్కనే ఉన్న కాలువను సగభాగం ఆక్రమించేసి ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండానే నిర్మాణం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్లానింగ్ సెక్రటరీ ఇప్పటికే నోటీసులు జారీ చేసి చార్జిషీట్ కూడా సిద్ధం చేస్తున్నారు. అయితే ఇటువంటి వాటికి జంకక సదరు యజమాని నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారు.



నగరంలోని నెల్లూరురోడ్డు (పాత మినీబైపాస్)లో నీలగిరి సంఘం, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన జంక్షన్ సమీపంలో షాపింగ్ కాంప్లెక్స్ కోసం భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇక్కడ మాస్టర్ ప్లాన్‌లో వంద అడుగులు ఉండగా ప్రస్తుతం 30 అడుగులు రోడ్డు మాత్రమే ఉంది. అయితే ఇక్కడ జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ రాదు. ఈ విషయం తెలిసి కూడా సదరు యజమాని తన పనిని కానిచ్చేస్తున్నారు. ఇవన్నీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు కన్పిస్తున్నా కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

పట్టణ ప్రణాళికా విభాగంలో అంతులేని అవినీతి

- నగరంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- నిబంధనలు పాటించని పలువురు భవన యజమానులు
- అనుమతులు లేకుండానే కట్టడాలు
- మామూళ్లు పుచ్చుకుని అధికారుల మౌనవ్రతం
- కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి
- నెల్లూరు నగరంలో ఇదీ పరిస్థితి

రూల్స్‌కు పాతరేసి నిర్మాణాలు పైపైకి..

నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో అవినీతి నిరాటంకంగా సాగుతోంది. సచివాలయ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ అధికారులు కుమ్మక్కై అక్రమ నిర్మాణాలకు సహకరిస్తూ మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతున్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు అక్రమంగా జరుగుతున్నా వాటి గురించి పట్టించుకునే పరిస్థితి కన్పించడం లేదు. కేవలం తమ జేబులు నింపుకునే పనిలో నిమగ్నమై మిన్నకుండి పోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నెల్లూరు(బారకాసు): నగర పాలక సంస్థ పరిధిలో పలు చోట్ల అనుమతులు లేకుండానే యథేచ్ఛగా భవన నిర్మాణాలు జరిగిపోతున్నాయి. వాటిని అడ్డుకునే వారే కరువయ్యారు. అనుమతులు లేకుండా, ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుపుతున్న సదరు యజమానుల నుంచి టౌన్‌ప్లానింగ్ అధికారులకు అడిగినంత ముడితే చాలు అటువైపు కన్నెత్తి చూడకుండా మిన్నకుండి పోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

పిటిషన్ వేసేదీ వారే.. బేరం కుదిర్చేదీ వారే...

టౌన్‌ప్లానింగ్‌లో మరో మాయాజాలం జరుగుతోంది. ఎవరైనా అనుమతి లేకుండా అక్రమ నిర్మాణం చేపడుతున్నా లేక అనుమతి ఉండి అందుకు విరుద్ధంగా భవన నిర్మాణం చేపడుతున్నా సమాచారాన్ని కొందరు వ్యక్తులకు టౌన్‌ప్లానింగ్ విభాగంలోని ఓ అధికారికి చేరవేస్తారు. కార్పొరేషన్‌లో కూడా ఫిర్యాదు చేస్తారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారి అక్రమ నిర్మాణం వద్దకు వెళ్లి మాకు ఫిర్యాదు వచ్చింది వెంటనే కూల్చేస్తామంటూ బెదిరిస్తారు. దీంతో భయపడిన సదరు యజమాని బేరానికి వస్తాడు. టౌన్‌ప్లానింగ్ అధికారి ఫిర్యాదు చేసిన వారి ఫోన్ నంబర్ ఇస్తాను వారితో మాట్లాడుకోమని చెప్పి వెళ్లిపోతాడు. ఆ ప్రకారమే వారితో మాట్లాడి బేరం కుదుర్చుకుని ముడుపులు అందజేసి నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటాడు. అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటేగానీ కార్పొరేషన్ పాలన గాడిలో పడే అవకాశం లేదని నగర ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నగర పాలక సంస్థ పరిధిలో భవన వివరాలు

నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 54 డివిజన్లు ఉన్నాయి. ఇందులో 1,83,643 భవనాలుండగా ఇందులో అపార్టుమెంట్లు, షాపింగ్ కాంప్లెక్సులు, షాపింగ్‌మాల్స్ దాదాపు 8వేలకు పైగా ఉన్నాయి. ఇక బహుళ అంతస్తుల భవనాలు దాపు 25వేలకు పైగా ఉన్నాయి. నెలకు కనీసం 20 భవనాలకు ప్లాన్ అప్రూవల్‌కు దరఖాస్తులు కార్పొరేషన్‌కు వస్తుంటాయి. వీటిలో రోజుకు రెండూ లేదా మూడు భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తుంటారు. భవన అనుమతుల ద్వారా కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయం కంటే టౌన్‌ప్లానింగ్ అధికారులకు రాబడే అధికంగా ఉంటోందని సమాచారం.

నిద్రావస్థలో నిఘా

నగరంలో జరుగుతున్న భవన నిర్మాణాలపై నిఘా ఉంచాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు నిద్రావస్థలో ఉంటున్నారు. ఎక్కడా కూడా తనిఖీలు చేపడుతున్న దాఖలాలు లేవు. దీంతో అక్రమ నిర్మాణదారులు తమ ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఒకవేళ ఎవరైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తే వారి ఆదేశాల మేరకు నామమాత్రపు చర్యలు చేపట్టి, సదరు అక్రమ నిర్మాణదారుల నుంచి అందినకాడికి వసూలు చేసుకుని మిన్నకుండి పోతున్నారు. అక్రమ నిర్మాణాలు చేసేవారికి టౌన్ ప్లానింగ్ అధికారుల అండ మెండుగా ఉండటంతో వారి ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. అక్రమం అని తెలిసినా కూడా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా నగరంలోని ఆచారివీధిలోని మున్సిపల్ ఎంప్లాయీస్ హోం ఎదురుగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవన నిర్మాణం

ఈ బహుళ అంతస్తులను నిబంధనలకు విరుద్ధంగా కడుతున్నారు. దీనిని ఆచారివీధి, మున్సిపల్ ఎంప్లాయీస్ హోం ఎదురుగా నిర్మిస్తున్నారు. ఈ భవనం సుమారు 105 అంకణాల్లో నిర్మిస్తున్నారు. ఈ భవనానికి సెల్లార్‌తో కలిపి ఆరు అంతస్తులు నిర్మించుకునే ప్లాన్ కోసం అప్లై చేసుకున్నారు. దీనికి సంబంధించి జులై 30వ తేదీన పర్మిట్ నంబరు 1031-0545-బీఎస్ఎంఎస్/ఏఎస్‌టీ-2024న దరఖాస్తు చేశారు. అయితే దరఖాస్తును అధికారులు పరిశీలించి తిరస్కరించారు. ఈ భవనానికి ముందు వైపు మూడు మీటర్లు సెట్‌బాక్ వదిలి నిర్మించాలి. కుడి, ఎడమ వైపున రెండు మీటర్లు, వెనుక వైపు రెండున్నర మీటర్లు వదిలి నిర్మించాలి. అలా లేకుండా వందశాతంతో దీవియేషన్‌తో నిర్మిస్తున్నారు. ఇంత వరకు ఈ భవనానికి సంబంధించి ప్లాన్ అప్రూవల్ కాలేదు. అయినా కూడా ఇప్పటికే చకచకా పనులు చేసి 50శాతం పూర్తి చేశారు. ఇంత జరుగుతున్నా కూడా 44వ డివిజన్ ప్లానింగ్ సెక్రటరీ, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, టీపీఓ, ఏసీపీ, సీపీ అధికారులెవరూ కూడా ఈ భవనం వైపు కన్నెత్తి చూడలేదు. ఇందుకు కారణం ముడుపులు పుచ్చుకోవడమేనని ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి



నగరంలో అనేక చోట్ల అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇలా జరుగుతున్నా కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. కళ్లముందే జరుగుతున్న అక్రమ నిర్మాణాలను కూడా అడ్డుకోవడం లేదు. టౌన్‌ప్లానింగ్ అధికారులకు ముడుపులు ముట్టజెప్పితే నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు జరుపుకోవచ్చు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలి.
– సుబ్బారెడ్డి, బంగ్లాతోట, నెల్లూరు నగరం

అధికారులు పట్టించుకోవడం లేదు



నెల్లూరు నగరంలో అనేక భవనాలు నిర్మాణాలు అక్రమంగానే జరుగుతున్నాయి. అయినా కూడా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదు. దీని వలన రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. దీంతో వీధులు చిన్నవైపోతున్నాయి. ఫలితంగా వాహనదారులు రాకపోకలు సాగించాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.
– ధనూజ, నజీర్‌తోట, నెల్లూరు నగరం.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలు



నగరం రోజురోజుకు విస్తరిస్తోంది. భవన నిర్మాణాలు కూడా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా కొనసాగిస్తున్నారు. వీటిని అడ్డుకునే వారు కరువయ్యారు. ఇప్పటికే కాలువలను ఆక్రమించి భవనాలు కట్టుకున్నారు. ఇకనైనా మేల్కొకపోతే భవిష్యత్తులో పార్కులు, ఇతర ప్రభుత్వ స్థలాల్లో కూడా అక్రమ నిర్మాణాలు జరిగే అవకాశాలు ఉంటాయి.
– షాజహాన్, న్యూకాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్

న్యూస్‌రీల్

గాంధీ ఆశ్రమం అభివృద్ధికి కృషి



పల్లిపాడు గోశాలలో కలెక్టర్

ఇందుకూరుపేట: పల్లిపాడులో గల పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని కలెక్టర్ ఆనంద్ అన్నారు. ఆశ్రమాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. తొలుత గాంధీజీ, స్థలదాత పొణక కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు, ఖాదీ వస్త్రం సమర్పించి నివాళులర్పించారు. ఆశ్రమంలోని గాంధీ ఫొటో ఎగ్జిబిషన్, గోశాల, అతిథి గృహాన్ని సందర్శించారు. స్థానికులు ఆశ్రమానికి రక్షణగా పెన్నా నది ఒడ్డున రిటైనింగ్ వాల్ లేదా రాళ్లతో కట్టలు నిర్మించాలని కోరారు. అలాగే పార్లకట్ట నుంచి ఆశ్రమానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు. అనంతరం కొత్తూరు ఎస్టీ కాలనీలోని అంగనవాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ లలితాంబ పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనం సందర్భంగా నేడు ట్రాఫిక్ దారిమళ్లింపు

నెల్లూరు(క్రైమ్): గణేశ్ నిమజ్జనం సందర్భంగా నెల్లూరు నుంచి జొన్నవాడ వెళ్లే మార్గంలో బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు పోలీసులు ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. బుధవారం అధిక సంఖ్యలో విగ్రహాలను ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం సమీపంలోని గణేశ్ ఘాట్‌లో నిమజ్జనం చేయనున్నారు. గురువారం ఉదయం వరకు నిమజ్జన కార్యక్రమం జరగనుంది. దీంతో బుధవారం మధ్యాహ్నం 2గంటల నుంచి గురువారం ఉదయం వరకు కేవీఆర్ పెట్రోల్‌బంకు, పొదలకూరు రోడ్డు, పాతమున్సిపల్ కార్యాలయం నుంచి జొన్నవాడ వైపు వెళ్లే, బుచ్చి నుంచి జొన్నవాడ మీదుగా నెల్లూరు వచ్చే వాహనాల రాకపోకలను నిషేధించారు. నెల్లూరు నుంచి జొన్నవాడకు, బుచ్చి నుంచి నెల్లూరుకు కోవూరు మీదుగా వాహనాలను నడపాల్సి ఉంది. కేవలం గణేష్ నిమజ్జన వాహనాలను మాత్రమే ఘాట్ వద్దకు అనుమతిస్తారు. ప్రజలందరూ సహకరించాలని నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి కోరారు.

పార్టీ మారలేదని 'పవర్' కట్

నెల్లూరు రూరల్‌లో పరాకాష్టకు చేరిన కక్ష సాధింపులు

- పంచాయతీ సర్పంచ్‌లను బెదిరించి పచ్చ కండువాలు
- ఇప్పటికే టీడీపీలో చేరిపోయిన పలువురు సర్పంచ్‌లు
- వైఎస్సార్‌సీపీలోనే ఉన్నారని ఇద్దరు సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేసిన వైనం

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అధికార పార్టీ ముఖ్య నేతల బెదిరింపులు, దౌర్జన్యాలు పరాకాష్టకు చేరాయి. వైఎస్సార్‌సీపీలోని కీలక నేతలను పార్టీ మారాలని, లేదంటే ఇబ్బందులు తప్పవని బెదిరించి మరీ పచ్చ కండువాలు కప్పుతున్న పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌లను టార్గెట్ చేసిన నాయకులు కొన్ని రోజులుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో పార్టీలోకి వస్తామన్న వారిని వదిలేస్తున్నారు. అయితే ఇద్దరు సర్పంచ్‌లు మాత్రం తాము పార్టీ మారే ప్రసక్తిలేదని వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని తెల్చి చెప్పడంతో వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగారు. అందులో భాగంగా ఆయా సర్పంచ్‌లకు నోటీసులు పంపించి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.



సర్పంచ్‌లకు చెక్ పవర్ రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మొత్తం 18 పంచాయితీలు ఉన్నాయి. ఆయా సర్పంచ్‌లలో ఇప్పటికే చాలా మంది ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరతామని సందేశాలు ఇచ్చారు. కొందరు చేరిపోయారు కూడా. ఈ క్రమంలో కలివెలపాళెం, సజ్జాపురం, పెనుబర్తి, గొల్లకందుకూరు, దేవరపాళెం గ్రామ సర్పంచ్‌లు టీడీపీలోకి వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో టీడీపీ నాయకులు వారికి బెదిరింపులు, అధికారులతో ఒత్తిళ్లకు గురి చేశారు. ఆయా పంచాయితీల్లోని వార్డు సభ్యులతో అధికారులకు ఫిర్యాదులు చేయించారు. గొల్లకందుకూరు, దేవరపాళెం, సజ్జాపురం సర్పంచ్‌లు టీడీపీలోకి వస్తామని చెప్పడంతో వారిని వదిలేశారు. కలివెలపాళెం గ్రామ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, పెనుబర్తి సర్పంచ్ సృజన మాత్రం తాము పార్టీ మారేది లేదని తేల్చి చెప్పారు. దీంతో వారిపై అధికార బలాన్ని వినియోగించి కక్ష సాధింపు చర్యలకు దిగారు. కలివెలపాళెం, పెనుబర్తి సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయితీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

అన్ని పంచాయితీల్లో జరిగేదే

ఫిర్యాదుల్లోని విషయాలను పరిశీలిస్తే... కొన్ని అంశాలను అజెండాలో పెట్టకుండా మినిట్స్‌లో తీర్మానించారని, థర్డ్ పార్టీ అకౌంట్లలో నిధులు వేయించుకున్నారని ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఇలాంటివి అన్ని పంచాయితీల్లో జరిగే ప్రక్రియే. అయితే సర్పంచ్‌లను టార్గెట్ చేసేందుకు అధికారులను వీటిని అడ్డం పెట్టుకున్నారని తెలుస్తోంది.

గ్రామసభలో తమ్ముళ్ల మధ్య వివాదం

- అధికారుల ఎదుటే బాహాబాహీ
- కొండాపురం మండలంలో ఘటన

కొండాపురం: ఉపాధి హామీ గ్రామసభలో తెలుగు తమ్ముళ్ల మధ్య వివాదం చెలరేగింది. అధికారుల ఎదుటే బాహాబాహీకి దిగారు. మండలంలోని సాయిపేట పంచాయతీలోని సచివాలయంలో 2023 – 24 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ గ్రామసభను ఈనెల 8వ తేదీన నిర్వహించారు. ఈ సమయంలో టీడీపీ నాయకుడు కుంకు మోహన్‌రావు, అదే పార్టీకి చెందిన ఒల్లూరు వెంకటేశ్వర్లు వర్గాల మధ్య వివాదం జరిగింది. దీంతో సభను తూతూ మంత్రంగా నిర్వహించారు. కుంకుమోహన్‌కు చెందిన వర్గం మళ్లీ సభను నిర్వహించాలని ఎంపీడీఓ బ్రహ్మయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం ఆడిట్ సిబ్బంది నీలకంఠం సభను ఏర్పాటు చేశారు. ఇందులోనూ ఆ రెండు వర్గాలు అధికారుల ఎదురుగానే బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు కుర్చీలు ఎత్తుకుని కొట్టుకునే వరకు వచ్చారు. పోలీసులు రంగ ప్రవేశంతో నాయకులు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా నీలకంఠం మాట్లాడుతూ సాయిపేట పంచాయితీలో ఉపాధి హామీ పథకం కింద రూ.1.13 కోట్లతో పనులు చేపట్టామని, ఇందులో తమ సిబ్బంది రూ.50 లక్షల వరకు రికవరీ తేల్చారన్నారు. కొలతల వల్ల రూ. 50 లక్షల నిధులు పక్కదారి మళ్లాయని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ధనంజయ్, స్థానికులు ఓరుగంటి సుమన్, కుంకు రాజా తదితరులు పాల్గొన్నారు.



వాగ్వాదంలో టీడీపీ నాయకులు

ఫోర్జరీ కేసులో జయవర్ధన్ లొంగుబాటు

- నిందితుడికి 14 రోజుల రిమాండ్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరపాలక సంస్థలో కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో నిందితుడైన జయవర్ధన్ మంగళవారం నెల్లూరు ఐదో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో లొంగిపోయాడు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో ఆయనను జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేశారు. బెయిల్ కోసం జయవర్ధన్ హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం కోర్టులో లొంగిపోయాడు. పోలీసులు త్వరలో కోర్టులో కస్టడీ పిటీషన్‌ను వేయనున్నట్లు తెలిసింది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న వార్డ్ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు నాగేంద్రబాబు, కార్తీక్ మాలవ్యలు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వద్ద మంగళవారం లొంగిపోయాడు.



రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'మారిటైమ్ బోర్డు' దృష్టి పెడితేనే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులకు అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతానికి మారిటైమ్ బోర్డులోని అత్యున్నత స్థాయి వర్గాల్లోనే ఫిషింగ్ హార్బర్‌ను ఎప్పుడు వినియోగంలోకి తీసుకురావాలనే అంశంలో స్పష్టత లేదని తెలుస్తోంది. మిగిలిపోయిన నిర్మాణ పనులు, మరికొన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఇవన్నీ పూర్తయితేనే మారిటైమ్ బోర్డు అధికారులు హార్బర్ నిర్వహణకు ఉపక్రమిస్తారు.

'మారిటైమ్ బోర్డు' దృష్టి పెడితేనే..

- వినియోగంలోకి రాని ఫిషింగ్ హార్బర్
- పూర్తి చేయాల్సిన పనులు ఇంకా ఎన్నో

కావలి: ఉమ్మడి నెల్లూరు జిల్లా తీర ప్రాంతంలో 118 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. వాటిలో 1.5 లక్షల మంది జనాభా ఉన్నారు. వీరిలో లక్ష మందికి చేపల వేటే జీవనాధారం. ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తే ప్రత్యక్షంగా లక్ష మంది మత్స్యకారులకు, పరోక్షంగా మరో లక్ష మందికి జీవనోపాధి మెరుగు పడటానికి దోహదపడుతుంది. బోగోలుకు 12 కిలోమీటర్లు, చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారికి 15 కిలోమీటర్లు, కావలి రైల్వేస్టేషన్‌కు 20 కిలోమీటర్ల దూరంలో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ఉంది.

ఇంకా పూర్తిచేయాల్సినవి

- హార్బర్‌లో మోటారైజ్డ్, మర పడవలు, సంప్రదాయ పడవలు పక్కపక్కనే నిలుపుదల చేసుకొనేలా నిర్మాణ పనులు పూర్తి కావాలి.
- బోట్లకు నిరంతరం మరమ్మతులు చేసుకోవడానికి అనువుగా చిప్పలేరు లోపల వాలుగా కాంక్రీట్ బెర్తుల నిర్మాణం చేయాల్సి ఉంది.
- హార్బర్ ప్రవేశ ద్వారం వద్ద బోట్లు రాత్రి, పగలు రాకపోకలు సాగించడానికి వీలుగా నీటిపై తేలియాడే సాధనాలు, కాంతివంతమైన పరికరాలు అమర్చాలి ఉంది.
- రోజుకు 2 లక్షల లీటర్ల తాగునీరు అవసరం. వాటి పనులు పూర్తి కాలేదు.
- మత్స్య సంపదను గ్రేడింగ్ చేసుకోవడానికి, వేలం వేయడానికి భవనాన్ని 360 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించాల్సి ఉంది.
- మత్స్యకారులకు అవసరమైన వేట సామగ్రి పరికరాలు, విడిభాగాలు అమ్మకాలు చేసే షెడ్లు, రెస్టారెంట్, మత్స్యకారుల విశ్రాంతి గదులు నిర్మించాల్సి ఉంది.

ఉపయోగం ఏమిటంటే..

ఫిషింగ్ హార్బర్ వినియోగంలోకి వస్తే మత్స్యకారులకు మేలు జరుగుతుంది. దేశ విదేశాల నుంచి వ్యాపారస్తులు నేరుగా మత్స్య సంపదను కొనుగోలు చేస్తారు. ధరల విషయంలో పోటీ వాతావరణం ఏర్పడి మత్స్య సంపదకు మంచి ధర లభిస్తుంది. ధరలు గిట్టుబాటు కాకపోతే ఫిషింగ్ హార్బర్‌లో ఉండే కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేసుకొనే సదుపాయం ఉండటం వల్ల ధరలు వచ్చిన తర్వాతే మత్స్యకారులు అమ్ముకోవచ్చు. జిల్లాలోని మత్స్యకారులే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన మత్స్యకారులు కూడా వేట చేసిన మత్స్య సంపదను హార్బర్‌లో దింపుకొని అమ్ముకోవచ్చు. దీని వల్ల జిల్లాలో మత్స్య రంగంపై ఆధారపడే వారికి ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఫిషింగ్ హార్బర్‌కు చేరుకొని వేట సామగ్రిని సురక్షితంగా కాపాడుకోవచ్చు.

క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్లకు ఎస్సైల అటాచ్

నెల్లూరు(క్రైమ్): ఏఎస్సైల నుంచి ఎస్సైలుగా పదోన్నతి పొంది వీఆర్‌లో ఉన్న వారిని వివిధ పోలీస్‌స్టేషన్లకు అటాచ్ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. తమకు కేటాయించిన పోలీస్‌స్టేషన్లలో విధుల్లో వెంటనే చేరాలని ఆదేశించారు.

• చిన్నబజార్‌కు ఎస్కెమ్ బాషా, నెల్లూరు రూరల్‌కు సుధీర్‌కుమార్, ఆత్మకూరుకు శ్రీనివాసులురెడ్డి, కావలి – 2 టౌన్‌కు గౌస్‌బాషా, కోవూరుకు ఖాదర్‌బాషా, కావలి – 1 టౌన్‌కు జానకిరామిరెడ్డి, కావలి రూరల్‌కు తిరుమల రెడ్డి, సౌత్ ట్రాఫిక్‌కు దాదాసాహెబ్, దర్గామిట్టకు బ్రహ్మయ్య, డీసీఆర్బీ, నెల్లూరుకు శ్రీనివాస్‌సింగ్, ఎన్‌హెచ్ స్క్వాడ్ / డీటీఆర్బీకి ముక్తియార్, సీసీఎస్, నెల్లూరుకు శ్రీనివాసులు, సంతపేటకు సుల్తాన్‌బాషా, ఉదయగిరికి శీనయ్య, డీటీసీ, నెల్లూరుకు శ్రీనివాసులు, బాలాజీనగర్‌కు నాగరాజు, ఎస్డీపీఓ, కావలికి శ్రీనివాసరావు, డీటీసీ, నెల్లూరుకు నాగయ్య, నవాబుపేటకు శివయ్య, డీసీఆర్బీ, నెల్లూరుకు శేషబాబును అటాచ్ చేశారు.

ఎన్నెమ్మెమ్మెస్ దరఖాస్తు గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్నెమ్మెమ్మెస్) పరీక్షకు సంబంధించిన దరఖాస్తు గడువును ఈ నెల 17 వరకు పొడిగించారని డీఈఓ రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దీనికి అర్హులని చెప్పారు. వివరాలకు దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్లో గల పరీక్షల విభాగాన్ని సంప్రదించాలని కోరారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలోని ఎం – 1 థియేటర్స్ సమీపంలో గల పట్టాలపై మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 55 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు కలిగి.. తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, గ్రే కలర్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

ఉలవపాడు: బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఘటన ఉలవపాడు మండల పరిధిలోని మన్నేటికోట శంకర్‌నగర్ గిరిజన కాలనీలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. కాలనీకి చెందిన తుమ్మల కార్తీక్ హైదరాబాద్‌లో బేల్దారి పనులకెళ్లి వినాయక చవితి సందర్భంగా గ్రామానికి వచ్చారు. నాలుగో తరగతి చదువుతున్న బాలిక వినాయక నిమజ్జనానికి వెళ్లేందుకు సిద్ధమైంది. ఈ తరుణంలో బాబాయ్ వరుసైన కార్తీక్ వచ్చి మేనత్త ఇంటి వరకు వెళ్లొద్దామంటూ తన వెంట తీసుకెళ్లారు. బాలికతో అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలేయడంతో పరారయ్యాడు. బాలికను కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా కార్తీక్‌ను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు.

మత్తు వదిలిస్తూ..

• జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు
• భారీగా జరిమానాలు
• పగలు సైతం ముమ్మరంగా నిర్వహించేలా సన్నాహాలు



నవాబుపేట పోలీస్‌స్టేషన్ వద్ద ఇలా.. (ఫైల్)

• నెల్లూరు నగరంలోని ప్రశాంతినగర్‌కు చెందిన రాహుల్ బైక్‌పై అర్ధరాత్రి ఇంటికెళ్తుండగా, పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేశారు. మద్యం తాగారనే విషయం తేలింది. దీంతో అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా, రూ.10 వేలు జరిమానా విధించారు.
• నెల్లూరు రూరల్ మండలం శ్రామికనగర్‌కు చెందిన భాస్కర్ పనినిమిత్తం నెల్లూరు నగరానికి వచ్చారు. అనంతరం సాయంత్రం ఇంటికెళ్తుండగా కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేశారు. మోతాదుకు మించి మద్యం తాగారని గుర్తించారు. కోర్టులో హాజరుపర్చగా, మూడు రోజుల జైలు శిక్ష పడింది.
• నెల్లూరు శివారు ప్రాంతంలో కొందరు యువకులు బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతుండగా, స్థానిక పోలీసులు దాడులు చేశారు. అనంతరం కేసులు నమోదు చేసి జరిమానా విధించారు.

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. వీరి కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోతుండగా, ఎంతో మంది దివ్యాంగులుగా మారుతున్నారు. మద్యం మత్తులో వాహనం నడపడం ప్రమాదమని తెలిసినా ఇష్టానుసారం వ్యవహరిస్తూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో సైతం మద్యం తాగుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. మత్తులో నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. మద్యం దుకాణాల సమీపంలో, శివారు ప్రాంతాలు, వంతెనలు, పాడుపడిన గృహాల వద్ద మందుబాబుల ఆగడాలకు అంతేలేకుండాపోతోంది. దీంతో సాధారణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డు ప్రమాదాలు, నేరాల కట్టడికి జిల్లా పోలీస్ యంత్రాంగం దృష్టి సారించింది. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు, బహిరంగ మద్యపానంపై ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు దాడులు చేస్తున్నారు.

ఎన్ని కేసులంటే..

ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, జాతీయ రహదారులు, సినిమా థియేటర్ల వద్ద పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిత్యం నిర్వహిస్తున్నారు. మద్యం తాగిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. ప్రాంతాన్ని బట్టి రూ.10 వేలు, రూ.2500 మేర జరిమానాలు విధిస్తున్నారు. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి మూడు రోజుల జైలు శిక్ష సైతం పడుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 4229 మందిపై కేసులు నమోదయ్యాయి. వీరికి కోర్టు రూ.62.50 లక్షల జరిమానా విధించింది. గతేడాదిలో 30 మందికి పైగా మందుబాబులు జైలు శిక్ష అనుభవించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు పదిమందికి పైగా జైలుకెళ్లారు. బహిరంగంగా మద్యం తాగుతున్న 5327 మందిపై కేసులు నమోదు చేశారు. కోర్టు వీరికి రూ.4,52,800 జరిమానా విధించింది. మొత్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగంగా మద్యం తాగడంపై 9556 కేసులు నమోదయ్యాయి. మరోవైపు ఇప్పటి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను రాత్రివేళ మాత్రమే నిర్వహించేవారు. ఇకపై పగలు, రాత్రి అనే తేడాలేకుండా నిర్వహించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు.



ఆత్మకూరు బస్టాండ్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

మత్స్యకారుల డిష్యుం.. డిష్యుం

• తమిళ బోట్లను అడ్డుకునేందుకు యత్నం
• ఆరుగుర్ని పట్టుకున్న వైనం



పట్టుబడిన తమిళ జాలర్లు

కావలి: కావలి సముద్ర తీరంలో స్థానిక మత్స్యకారులు, తమిళ జాలర్ల నడుమ విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉంది. సముద్రంలో చేపల వేట చేసుకుంటూ కావలి మండలంలోని తీర ప్రాంత జలాల్లోకి తమిళ జాలర్లు భారీ బోట్లతో రెండు రోజుల క్రితం వచ్చారు. ఈ తరుణంలో చెన్నాయపాళెం పెద్దపట్టపుపాళేనికి చెందిన మత్స్యకారులు ధైర్యం చేసి తమిళ జాలర్ల బోట్లను తరిమారు. ఈ తరుణంలో వారికి, స్థానిక మత్స్యకారుల మధ్య వివాదం చెలరేగింది. ఘటనలో తమిళ బోట్లు పరారవ్వగా, ఒక బోటును ఇక్కడి వారు తమ ఆధీనంలోకి తీసుకొని ఆరుగుర్ని పట్టుకున్నారు. విషయం పోలీసులకు తెలిసింది. తమిళ బోట్ల యజమానుల మధ్యవర్తిత్వంతో ఇక్కడి వారు వదిలేశారు.

మా బాధను పాలకులు అర్థం చేసుకోవాలి



సముద్రంలో తమిళ జాలర్లతో ఇక్కడి మత్స్యకారుల పడే బాధలు ఎవరికీ అర్థం కావడం లేదు. పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉంటోంది. తమిళ జాలర్లను కట్టడి చేసేలా పాలకులు చర్యలు చేపట్టాలి. వీరితో అన్ని రకాలుగా నష్టపోతున్నాం.
– కొమారి రాజు, మత్స్యకార నేత, కావలి

చెత్తతో సంపద తయారీ కేంద్రాలు సిద్ధం



మాట్లాడుతున్న సుస్మితారెడ్డి

మనుబోలు: జిల్లాలోని వివిధ పంచాయతీల పరిధిలో చెత్తతో సంపద తయారీ కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని డీపీఓ సుస్మితారెడ్డి పేర్కొన్నారు. మనుబోలు పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించి, రికార్డులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. జిల్లాలోని 722 పంచాయతీలకు గానూ 517 పంచాయతీల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాలున్నాయని తెలిపారు. కొంతకాలంగా ఇవి నిరుపయోగంగా ఉన్నాయని, వీటిని త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నామని వెల్లడించారు. వానపాముల సాయంతో కంపోస్ట్ ఎరువు తయారీ ప్రక్రియను పునరుద్ధరిస్తామని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగవ్వడంతో పాటు అక్కడ తయారయ్యే కంపోస్ట్ ఎరువును రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి చెంచుప్రసాద్, ఏఓ రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	రూ.124
లేయర్ (లైవ్)	రూ.105
బ్రాయిలర్ చికెన్:	రూ.226
స్కిన్‌లెస్ చికెన్:	రూ.250
లేయర్ చికెన్:	రూ.178

డీసీపల్లిలో 530 బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 530 బేళ్లను మంగళవారం విక్రయించామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 747 బేళ్లు రాగా, వీటిలో 530 బేళ్లను విక్రయించగా, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. 60,894 కిలోల పొగాకును విక్రయించగా, రూ.1,45,68,633 వ్యాపారం జరిగిందని వివరించారు. గరిష్ట ధర కిలో రూ.358.. కనిష్ట ధర రూ.180.. సగటు ధర రూ.239.25గా నమోదైందని పేర్కొన్నారు. వేలానికి 15 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

రుణాలను బ్యాంకులు మంజూరు చేయాలి

• కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రుణాలను బ్యాంకులు తప్పక మంజూరు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల శాఖ ద్వారా ఏర్పాటు చేసిన క్లస్టర్లకు రుణాలను మంజూరు చేయాలని చెప్పారు. జిల్లాలో పీఎంఈజీపీ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేయాలని కోరారు. జిల్లాలోని కౌలు రైతులకు లోన్ క్రెడిట్ కార్డులను ఈ నెలాఖరులోపు మంజూరు చేయాలని సూచించారు. ఎల్డీఎం ప్రదీప్‌కుమార్, ఆర్బీఐ ఏజీఎం హనుమకుమారి, నాబార్డు డీడీఎం బాబు, వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి, పశుసంవర్ధక శాఖ జేడీ కోటేశ్వరరావు, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, చేనేత శాఖ ఏడీ వరప్రసాద్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు శ్రీనివాసరావు, మోహన్‌రెడ్డి, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు ధ్వంసం అనైతికం

• కారకులపై కేసు నమోదు చేయాలి
• ఓగూరు ఎస్సీ కాలనీ వాసులకు రక్షణ కల్పించాలి

కందుకూరు: మండలంలోని ఓగూరు గ్రామంలో గల ఆదిఆంధ్ర కాలనీ వాసులు రాకపోకల కోసం నిర్మించుకున్న కల్వర్టును కొందరు టీడీపీ నేతలు ధ్వంసం చేసి, మట్టిని సైతం ట్రాక్టర్‌తో ఎత్తుకుపోవడాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేతలు మంగళవారం తీవ్రంగా ఖండించారు. గతంలో పంచాయతీ, ఇరిగేషన్ శాఖల అధికారుల అనుమతితో కల్వర్టును నిర్మించామన్నారు. ఈ కల్వర్టును ఒంగోలు డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు అనుచరులు అల్లం రాధయ్య, అల్లం వెంకటేశ్వర్లు, చల్లా కొండయ్య, కంద్రా హరిబాబులు జేసీబీలతో ధ్వంసం చేశారని వివరించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఆదిఆంధ్ర కాలనీ వాసులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటేశారని, దీన్ని మనస్సులో పెట్టుకున్న స్థానిక టీడీపీ నేతలు కక్షతో కల్వర్టును పూర్తిగా ధ్వంసం చేశారని వారు విమర్శించారు. కల్వర్టును ధ్వంసం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. టీడీపీ నేతల చర్యను ఖండించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ తోకల కొండయ్య, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జాజుల కోటేశ్వరరావు, జెడ్పీటీసీ, ఎంపీపీల ప్రతినిధులు తొట్టెంపూడి శ్రీనివాసులు, ఇంటూరి మాధవరావు, మండల కన్వీనర్ గంగవరపు వెంకట్రావ్, జిల్లా కార్యదర్శి చీమల రాజా, నేతలు ఈదర రమేష్, కోవూరు, పలుకూరు, పాలూరు గ్రామాల సర్పంచ్‌లు ఆవుల మాధవరావు, శ్రీనివాసరావు, రామారావు తదితరులు ఉన్నారు.

సర్దుబాటుకు టీచర్ల విముఖత

• మండల, డివిజన్లలో ప్రక్రియ పూర్తి
• ఇంకా జాయిన్‌కాని వారు వందకుపైనే..

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను సాగదీస్తున్నారనే విమర్శలున్నాయి. జిల్లాలోని ఆయా పాఠశాలల్లో మొత్తం 782 మంది ఉపాధ్యాయులు సర్‌ప్లస్‌గా ఉన్నారని లెక్కలు తేల్చారు. వీరిలో 545 మంది ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. వీరు ఆయా పాఠశాలల్లో రిలీవై వెంటనే కొత్త పాఠశాలల్లో చేరాలని జిల్లా విద్యాశాఖాధికారులు గత వారంలో ఆర్డర్లు ఇచ్చారు. అయితే కొంతమంది ఉపాధ్యాయులు నేటికీ ఆయా పాఠశాలల్లో చేరేందుకు విముఖత చూపుతున్నారు. ఆయా పాఠశాలలకు సర్దుబాటు చేయగా ఇంకా 232 మంది ఉపాధ్యాయులను మిగులుగా తేల్చారు. విద్యాశాఖాధికారులు చేసిన సర్దుబాటుకు కొంతమంది ఉపాధ్యాయులు విముఖత చూపుతున్నారని తెలిసింది. గత వారంలో వీరికి ఆర్డర్లు జారీ చేశారు. వీరిలో 100 మందికి పైగా ఆయా ప్రాంతాల్లో చేరేందుకు ఇష్టపడటం లేదు. మంగళవారం నాటికీ వీరు జాయిన్ కాలేదని తెలిసింది. ఎంఈఓలు ఇష్టారాజ్యంగా చేయడంతోనే సర్దుబాటు ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందంటున్నారు.


కుటుంబసభ్యులకు బాలుడి అప్పగింత

కావలి: కావలి రైల్వేస్టేషన్లో బిక్కుబిక్కుమంటున్న పదేళ్ల బాలుడ్ని కుటుంబ సభ్యుల చెంతకు రైల్వే పోలీసులు చేర్చారు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. వింజమూరు సుజాతనగర్‌కు చెందిన బాలుడు మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో రైల్వేస్టేషన్లో ఒంటరిగా ఉండటాన్ని రైల్వే కానిస్టేబుల్ నవీన్ గమనించారు. బాలుడి నుంచి వివరాలను సేకరించారు. తమది వింజమూరులోని సుజాతనగర్ అని, తండ్రి చనిపోవడంతో నాయనమ్మ వద్ద ఉంటున్నానని తెలిపారు. తన మామతో కలిసి ఒంగోలు వెళ్లగా, తిరుగు ప్రయాణంలో ఒక్కడ్నే రైలెక్కించి పంపారని చెప్పారు. వెంటనే వింజమూరులోని బాలుడి నాయనమ్మకు, బంధువులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన కావలి రైల్వేస్టేషన్‌కు రాగా, బాలుడ్ని అప్పగించారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

ఉలవపాడు: విశ్రాంత ఉద్యోగి ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన ఉలవపాడులో చోటుచేసుకుంది. వివరాలు.. ఉలవపాడుకు చెందిన షేక్ చౌదరిబాబు విశాఖపట్నం షిప్ యార్డులో పనిచేసి ఉద్యోగ విరమణ పొందాక స్థానికంగా సొంత గృహాన్ని నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో కుటుంబసభ్యులతో కలిసి విశాఖపట్నానికి వారం క్రితం వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికొచ్చిన ఆయన చోరీ విషయాన్ని నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఆరు సవర్ల బంగారం, ఐదు గ్రాముల వెండి, రూ.20 వేలను చోరీ చేశారు. రిటైరయ్యే సమయంలో ఇచ్చిన షీల్డులోని పతకాలను సైతం అపహరించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దేశ భద్రతే ధ్యేయం



చిట్టగుంట: దేశ భద్రత, రక్షణే భారత ఆర్మీ ధ్యేయమని మేజర్ అభినవ్ రావత్ పేర్కొన్నారు. టెరిటోరియల్ ఆర్మీ 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్మీలోని వివిధ విభాగాలకు చెందిన సుమారు 60 మంది సైనికులు కశ్మీర్‌లోని సియాచిన్ నుంచి అండమాన్‌లోని ఇందిరా పాయింట్ వరకు చేపట్టిన సైకిల్ యాత్ర కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వద్దకు మంగళవారం చేరుకుంది. ఈ సందర్భంగా సైనికులకు అధ్యాపక బృందం, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.